# నిరతిశయం

'రెండు రోజుల్లో వస్తాను' అని బయలుదేరాడు గోవిందరావు. అతను ఎక్కడకు వెడుతున్నాడో సునీతకి తెలుసు. అతని ముఖంలోకి సూటిగా చూసి చిన్నగా నవ్వింది.

గోవిందరావు మేడ మెట్లు దిగాడు. కారు బయటకు తీశాడు. వరండాలో కుర్రాళ్లు ముగ్గురూ వరుసగా నిలుచున్నారు, తండ్రి వెడుతూ వున్నప్పుడు చూడటానికి. ఇలాంటి దృశ్యం వాళ్ళకూ అలవాటు అయిపోయింది. ఎంతవరకు అర్థం అయిందో మాత్రం సునీత ఊహకు అందదు. పెద్దబ్బాయికి అప్పుడే పధ్నాలుగో యేడు వస్తోంది. తతిమ్మా యిద్దరికీ పదకొండు, ఎనిమిదీని. పెద్దవాడికి కొద్ది కొద్దిగా అర్థం అవుతున్నట్లు ఆమెకు అనుమానమే. వాడి ముఖంలో కొంత నిరసన, నిరాశ అగుపిస్తున్నాయి. పైకి మాత్రం ఏమీ అనడు. వాడు ముమూర్తులా తండ్రి పోలికే. అయితే మనసుకు కూడా తండ్రి కోరికలు రాకూడదని సునీత తనకు తెలిసిన, తెలియని దేవుళ్ళందరికీ మొక్కుకుంటూంది.

ఆలస్యంగా పిల్లలు పుట్టడం వల్ల ఆమెకు భర్త మరీ దగ్గరయిన మాట నిజమే. అయితేనేం? రెండో పిల్లవాడు కడుపులో పడ్డప్పుడు మొదలెట్టాడు గోవిందరావు ఈ లీలలు.

'ఎందుకు ఈ పని చేశారు? నేను మీకేం తక్కువ చేశాను?' అని మొరాయించి అడిగింది. అతను ఆ చెప్పడం కూడా ఏదో తమాషాగా కవ్వింపుగా అన్నాడు. 'ఎవరో వచ్చి నా మీద నీకు పితూరీలు చెప్పడం ఇష్టంలేదు. అందుకని నేనే చెబుతున్నాను. అంతమాత్రం చేత మనమధ్య వివాదాలు, సంవాదాలు రానక్కర్లేదు'– పెళ్ళి చేసుకోకుండా చాటు మాటు వ్యవహారాలు చాలాకాలం కొనసాగించడం తనకు ఇష్టం లేదన్నాడు. ఇద్దరికీ అది ఆరోగ్యం కూడా కాదన్నాడు. 'నీవు చాలామంచిదానివని నాకు తెలుసు. ఎలాంటి ఫిర్యాదులు చేయవు. నీకూ – నీ పిల్లలకు...అదే మన పిల్లలకు...ఏమీ అన్యాయం జరగదు.

నా సరదాలు నాకు తీరనీ!' అని ప్రాధేయపడుతున్నట్లు అడిగాడు. అలా అడిగాడని సునీత అనుకున్నది గాని అతని కంఠస్వరంలో అధికార దర్పం, అతిశయం స్పష్టంగా కనిపిస్తూనే వున్నాయి. అతని 'సరదాలు' అనే మాట మాత్రం ఆమెకు విచిత్రంగా ధ్వనించింది. తను బొత్తిగా వంటింటి కుందేలు అయిపోతూ వున్నదని అతను మొదటినుంచీ చెప్తూనే ఉన్నాడు.

గోవిందరావు బిజినెస్ మాగ్నెట్! ధార్మికుడుగా మంచి పేరు కూడా సంపాదించుకున్నాడు. బోలెడంత పలుకుబడి. సంఘంలో మర్యాదలకు, మన్నలకు ఏమీ కొరతలేదు. పదవులు, అధికారాలు....వాటితోపాటు సహజంగా సమకూడే ఆర్థిక వసతి- పోగయినపుడు మనిషి యెన్ని వేషాలు అయినా వేయటానికి వీలుంటుంది. ఏం చేసినా చెల్లిపోతుందనే భరోసా మనిషిని ఎటువయిపైనా లాక్కుపోతుంది.

ఆదర్శ గృహిణిగా వుండడమే సునీతకి ఇష్టం. 'నాతోపాటు పార్టీలకు, మీటింగులకు రమ్మంటే రావు. ఇల్లు తీర్చిదిద్దడంలోనే నీ సమయం అంతా హరించుకుపోతోంది. ఇల్లు ఒక్కటే చాలదు సునీత, కాస్త బయటి ప్రపంచంలో కూడా తిరగడం, మసలడం నేర్చుకోవాలి' అని గోవిందరావు ఆమెకు హితోపదేశం చేశాడు, అవకాశం దొరికినప్పుడల్లా విడవకుండా. అయితే ఆమె ఈ మాటలు చెవికి వేసుకోలేదు. చక్కటి సంగీతం వింటూ కూర్చోడం, మంచి పుస్తకాలు చదువుతూ వివేకం పెంచుకోవడం కంటె, క్లబ్బులు- సెమినార్లు -సమావేశాలు ఎక్కువ ఆనందం ఇస్తాయా? సునీత ఒక్కనాటికీ ఇది సాధ్యంకాదని నిర్ధారణ చేసుకు కూర్చుంది, అప్పుడు.

'నీకేం ఎంబెరాస్‌మెంట్ లేదు. ఆమె ఈ ఊరులో వుండదు. ముప్ఫయి కిలోమీటర్ల దూరం. నేనే అప్పుడప్పుడు వెళ్ళి వస్తూ వుంటాను. మరేం భయం పెంచుకోకు' అని గోవిందరావు అభయం ఇచ్చినట్లుగా మాట్లాడాడు. సవతి పోరు గురించి పుస్తకాలలో చదవడం అలవాటే - తనదాకా వస్తే ఎలా వుంటుందో అన్న భయం ఆమెను దిగ్భ్రమ చేసింది.

అతను ఇంట్లో వుండని రోజులు వారానికి రెండే అయినాగానీ, సునీతకి నరకప్రాయంగా వుండేది మొదట్లో. తరువాత అలవాటు అయిపోయింది. అంతేకాదు. ఆమెను గురించి అవలీలగా కబుర్లు చెబుతూ కూర్చోవడం కూడా చేస్తూ వచ్చాడు గోవిందరావు తనను సమాధానపరచటానికి, సంతోషపెట్టడానికి - అన్నట్లుగా. తన

జీవితం సూటిగా సరళంగా ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా జరిగిపోతోందనీ, 'ఇందుకు కారణం నీవే సుమా! నీ ఔదర్యం గొప్పది....' అన్నట్టుగా వుంటాయి అతని మాటలు. సునీత ఉదాసీనంగా వింటూ కూర్చోవడం అలవాటు చేసుకుంది. ఏమిటి ఈ మనిషి వాలకం! తప్పు చేస్తున్నాననే స్పృహే లేదు. అసలు 'తప్పు' అని అతను అనుకుంటున్నట్లే లేదు.

తన అసహాయతను ఆసరాగా తీసుకుని ఆటలాడుతున్నాడని పురి ఎక్కించటానికి ప్రయత్నించారు కొందరు – బంధువులు, నేస్తాలు కూడా. ఏం చేయగలుగుతుంది తను? విడాకులు ఇమ్మని అడుగుతుందా? తక్షణమే ఇచ్చేస్తానంటే అదో సమస్య అయి కూర్చుంటుంది. ఆత్మాభిమానం వున్న మనుషులు ఏం చేస్తారో సునీతకి ఒక్కమారూ నిర్థారణగా తెలిసిరాలేదు. పిల్లల ముందు బేలతనం ప్రదర్శించడం ఆమెకు ఏమాత్రం ఇష్టంలేదు. శిలలా, మన్నుతిన్న పాములా వుండకుండా వీలయినంత ఎక్కువ చురుకుతనం, కలివిడితనం అలవాటు చేసుకుంటూ ఏకాంతాన్ని మరచిపోవటానికి, అలక్ష్యం చేయటానికి అలవాటుపడిపోయింది.

మూడో కుర్రాడు కూడా ఎదిగి వాడి పనులు వాడు చేసుకోగల ఈడు వచ్చిన తరువాత సునీతకి కాల విరామం ఎక్కువ అయిపోయినట్లు అనిపించింది. అప్పటికి 'ఆమె'కూ ఇద్దరు పిల్లలు.

గోవిందరావులో గొప్ప సుగుణం అనిపిస్తుంది సునీతకి – అతను ఆమెను ఇంటికి తీసుకురావటానికిగాని, తనను అక్కడకు తీసుకువెళ్ళటానికిగాని ఏ మాత్రం ప్రయత్నం చేయలేదు. రెండు సమానాంతర రేఖలుగానే వుండాలి తప్ప ఇంకొక ఆసరా అవసరంలేదు. ఇద్దరికీ 'కేంద్రబిందువు' తనే. ఇద్దరికీ పరస్పరాశ్రయం తానే.

'ఆమె' ఉద్యోగం చేసుకుంటూంది.

పిల్లలను జాగ్రత్తగా చూచుకుంటూంది.

అతన్ని ఎప్పటికప్పుడు ప్రేమగా లాలనగా గమనిస్తోంది–ఇదీ గోవిందరావు ప్రతిమారూ సునీతకి చెప్పే మాటలు. ఇలాంటి మాటలే ఆమెతో కూడా తనను గురించి 'మూసలో పోసినట్లు' చెబుతాడని సునీతకి నిర్థారణే. వింటూ వుండడం తప్ప చొప్పదంటు ప్రశ్నలు వేసి వేధించడం అలవాటు లేదు. కనుక, ఎప్పుడూ అతన్ని ఏమీ అడగలేదు సునీత.

క్రమంగా, ఆమె 'వినడం' మానేసి, వింటున్నట్లుగా నటించడం కూడా నేర్చుకుంది. అన్నీ మనసుకు చేర్చుకోవల్సిన అవసరంలేదు.

అతను 'అక్కడి' నుంచి వచ్చినపుడు మరింత ఆప్యాయంగా దగ్గరకు చేరడం, ఎక్కువగా మక్కువ చూపించడం...తెలియకుండానే అలవాటు చేసుకుంది. అతను అన్నీ గమనిస్తూనే రెండు సంసారాలు నెట్టుకు వస్తూన్నందుకు గర్వపడుతున్నాడు.

డబ్బు విషయంలో కొత్త ఇబ్బందులు ఏమీ లేక పోయినప్పటికీ జనాభా పెరగడంవల్ల రెండు చోట్లా ఎదిగే పిల్లల అవసరాలు ముఖ్యమయిపోవడంవల్ల సునీత పొదుపరితనం అలవాటు చేసుకుంది. ఇక్కడి అవసరాలు కొన్ని మానుకోవలసి వచ్చినా కళవెళపడకుండా, మనసులోనికి వెలితిని రానీకుండా రోజులు దొర్లించేస్తోంది.

ఈ మనిషిని మరో శరీరం అతుక్కుపోతోంది.

ఈ మనిషితో మరో మనిషి ఆప్యాయత పెంచుకుంటోంది.

ఈ మనిషి పూర్తిగా తన మనిషికాదు.... ఇటువంటి ఆలోచనలు అప్పుడప్పుడు వస్తూ వున్నా అవి అసూయలుగా పరిణమించడం లేదు.

అసలు ఇలాంటి ఆలోచనలు అసలు పుట్టకుండా వుండడం కోసం ఆమె ఇప్పుడు కొన్ని 'వ్యాపకాలు' కూడా మొదలెట్టింది. గోవిందరావు చిన్నప్పుడే చెప్పినట్లుగా 'క్లబ్'లో మెంబర్‌షిప్ తీసుకుంది. సాంఘిక కార్యకలాపాలలో విరివిగా పాల్గొంటూంది. సంక్షేమ కార్యక్రమాలకు ప్రణాళికలు తయారుచేసి అందరిచేత అమోదింపచేస్తోంది.

'మిసెస్ గోవిందరావు' కనుక ఆమెకు క్లబ్‌లో మొదటినుంచి అనుకున్నదానికన్నా ఎక్కువగానే గౌరవం, మన్నన దొరుకుతున్నాయి. ఈ క్లబ్ కార్యక్రమాలు కేవలం ఇక్కడికే పరిమితం కాదు.

అప్పుడప్పుడు కన్వెన్షన్లు ఇతర పట్టణాలలోనూ ఏర్పరుస్తారు. వాటికి వెడుతూ వస్తూ వుండడంవల్ల సునీతకి తానో కొత్త మనిషిలా రూపుకట్టుకుంటున్నట్లు అనిపించసాగింది.

గోవిందరావు 'ఆమెను' గురించి చెబుతున్న సందర్భాలలో ఆమె కూడా ఇటువంటి సంక్షేమ కార్యక్రమాలలో ఎక్కువగా పనిచేస్తూ సాంఘిక ప్రతిపత్తి సంపాదిస్తున్నట్లు తెలుసుకుంది సునీత.

అవును! తనకు లభిస్తున్నపాటి గౌరవం 'ఆమె'కు సాధ్యమే కదా! పైగా ఉద్యోగం. స్వంతంగా కొంత పేరు ప్రతిష్టలు సంపాదించుకునే అవకాశం వుండనే వుంది. అప్పుడనిపించింది సునీతకి – తనకూ 'ఆమె'కూ ఏదో సాన్నిహిత్యం వున్నట్లు. ఏదో తెలియని సంబంధం, అర్థం కాని పోలికలు, అవగాహనకు అందని అన్యాయాలు...ఇవి ఇద్దరినీ కలిసికట్టుగా వుంచుతున్నాయి.

ఒకే కేంద్ర బిందువు వైపు ప్రయాణంచేస్తున్న వ్యాసార్థాలు తాము ఇద్దరూనూ! పరిచయాలు లేకపోతేనేం, ఒకళ్ల ముఖం మరొకళ్లు చూచుకోకపోతేనేం? ఇద్దరూ ఒకే అద్దంలో రూపుదిద్దుకుంటున్నారు. జరుగుతున్నదంతా ఏదో యాదృచ్ఛికంగా నడుస్తోంది అనుకోవటానికి వీలులేదు.

గోవిందరావు దృష్టిలో ఇదంతా ఎలా వుంటుందా అని ఒక్క క్షణం ఆలోచన వచ్చింది సునీతకి. 'ఆమె'ను గురించి ఆలోచన వచ్చినప్పుడు తేలికగా పక్కకు నెట్టివేయడం సునీతకి అలవాటే అయిపోయినా, ఇప్పుడిప్పుడు అది కాస్తా 'బద్ధకం' చేస్తోంది. మత్తు కలిగిస్తోంది. తను ఎందుకు ఇలా బలహీనురాలు అయిపోతోందో కారణం కనిపించదు. ఆకలింపు అవని అకారణం – అని ఒక్కమారు నిట్టూర్పు విడిచి ఊరుకుంది.

అసలు అతను ఈ సంబంధం తెగతెంపులు చేసుకుంటే ఎంత బాగుండును! అనిపించింది కూడా కొన్ని మార్లు. ఎందుకు చేసుకుంటాడు? రెండు చోట్లా దేవుడిలా పూజలు అందుతూ వున్నప్పుడు!

'ఆమె' కూడా తనను గురించి ఇలాగే అనుకుంటుందా? అతన్ని ఎక్కువగా ఆకట్టుకోవాలని, ఆమె ప్రయత్నం చేస్తోందా? ఏమో, గోవిందానికి తెలియాలి. ఆలోచించినకొద్దీ మనసు వికలం అయిపోయే మాట నిజమే గాని, మరేం ప్రయోజనం వుండదు.

ఈసారి క్లబ్ కన్వెన్షన్ 'ఆ' పట్టణంలో జరుగుతుంది. 'ఆమె' వుండి ఉద్యోగం వెలగబెడుతున్న పట్టణం. సాంఘిక ప్రతిపత్తి కూడా సంపాదించుకున్న పట్టణం.

ఈ కన్వెన్షన్‌కు ఆమె కూడా వస్తుంది. తప్పనిసరిగా వస్తుంది – అని చెప్పుకుంది సునీత. తనకు తానే, అందుకు ఏ మాత్రం అవసరం లేకపోయినా.

ఇన్నాళ్లకు–ఇన్నేళ్ళకు అనుకోకుండా ఆమెను చూడడం జరుగుతోందన్నమాట. ఈ మాట మనస్సుకు తట్టడంతోటే సునీతకి వళ్ళంతా వేడెక్కిపోయింది. వెన్నెముకలో ఏదో జరజర పాకుతున్నట్లు అనిపించింది.

'ఆమె' వస్తుంది. 'ఆమె'ను చూస్తాను. నాలో కనిపించని విశేషాలు ఆమెలో ఏమేం గమనించాడో గోవిందం...అవన్నీ నేను ప్రత్యక్షంగా చూస్తాను...అని ఊరటగా చెప్పుకుంది సునీత.

'ఆమెను' పలుకరించాలా? ఏమని?

ఆమె ముందు మాట్లాడుతుందా? ఏమంటుంది?

తను ఏలా స్పందించాలి..ఈ సందర్భానికి ఏది యుక్తం?

ఎంతోసేపు ఈ విషయం మనసులో మల్లగుల్లాలు పడిన తరువాత అనిపించింది సునీతకి – ఎందుకింత తాపత్రయం? ఏం జరుగనున్నదో అదే జరుగుతుంది. తాను చూస్తూ వుండడమే తప్ప చేయవలసింది మరేమీ లేదు. ఇప్పుడు కొత్తగా తవ్వి తలకెత్తుకోవలసింది ఏమీ లేదు.

★ ★ ★

కన్వెన్షన్ ప్రారంభం అయింది. సునీత వెళ్ళేటప్పటికి హాలంతా దాదాపు నిండిపోయింది. ఇలాంటి కన్వెన్షన్లు ఎక్కడ జరిగినా, ఎన్ని జరిగినా తానే అధ్యక్ష స్థానం అలంకరించడం అనవాయితీ. ఇప్పుడు అలాగే జరుగుతుంది, అందుకేమీ విపర్యయం లేదు. అని ధైర్యం చెప్పుకుంది.

సునీత గబగబా ముందుకు నడిచింది హాలులోనికి.

కార్యకర్తలు ఆమెను ఆదరంగా నడిపించుకు తీసుకువచ్చి మొదటి వరుసలో తనకు కేటాయించిన కుర్చీలో కూర్చోబెట్టారు.

సభ ప్రారంభం కానున్నది.

కార్యక్రమ నిర్వాహకుడు మైకు ముందుకు వచ్చి నిలుచున్నాడు.

హాలులో వున్న జనం అంతా ఎవరూ చెప్పకుండానే నిశ్శబ్దాన్ని అలుముకున్నారు. నిర్వాహకుడు అందరికీ స్వాగతం చెప్పాడు.

'ఈ సభకు అధ్యక్షురాలు మిసెస్ గోవిందరావుగారిని వేదిక మీదకు వచ్చి అధ్యక్ష పీఠం అలంకరించవలసిందిగా కోరుతున్నాను' అన్నాడు వినయంగా సాదరంగా.

'మిసెస్ గోవిందరావు' అనే మాట వినడంతోటే సునీత కూర్చున్న చోటనుంచి లేచింది. 'ఆమె' కూడా 'మిసెస్ గోవిందరావే' అన్న విషయం ఒక్క లిప్తపాటు మనస్సునుంచి తొలగిపోయింది.

ఏదో నాటకంలాగ జరుగుతోంది.

సునీత లేచి వేదిక వైపు నడక సాగించింది.

మరో పక్కనుంచి సురుచి కూడా లేచి నిలబడింది ఆమె కూడా వేదికవైపు ముందుకు వడవడం ప్రారంభించింది. నాటకంలో పాత్రలు వేదికమీదికి చేరుతున్నాయి.

హాలంతా – సభంతా నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దం తీసుకువచ్చిన వివేకంతో సునీత ఒకమారు అటు యిటు చూచింది. సురుచి కూడా ముందుకు వస్తూ వుండడం ఆమెకు అగుపించింది. వాళ్ళిద్దరూ ఒకరినొకరు చూచుకున్నారు.

వేదిక ఎక్కిన వాళ్లు ఒకళ్ల ముఖంలోకి మరొకళ్లు చూచుకుని సన్నగా నవ్వుకున్నారు. ఎవరో వీపు తట్టినట్లుగా ఇద్దరూ ఒకేమారు వెనక్కు తిరిగారు. వేదిక దిగివచ్చి తమ పూర్వాస్థానాల్లో కూర్చుండిపోయారు. ఇద్దరి ముఖాలలోనూ ఆ సన్నని నవ్వు మాత్రం మటుమాయం కాలేదు.

హాలులో – సభలో – వింతగా కలకలం బయలుదేరింది.

ఎవరెవరో గుసగుసగా మాట్లాడుకుంటున్నారు.

కార్యకర్తల్లో ఒక్కక్షణం ఉరుకులు, పరుగులు అగుపించాయి.

సునీత మాత్రం తనకేమీ పట్టనట్లుగా నిదానంగా కుర్చీకి అతుక్కుపోయి కూర్చుంది.

హాలంతా ఒక్కక్షణంలో మళ్లీ సద్దుమణిగింది.

ప్రధాన కార్యకర్త వేదిక మీదనుంచి కిందకు దిగి వచ్చాడు. సునీత కూర్చున్నవైపు గబ గబ వస్తూ వుండడం – చప్పుడు తప్ప యింకేమీ వినిపించడంలేదు.

అతను – కార్యకర్త –సునీత పక్కగా నిలబడి, 'రండి మేడమ్! వేదిక మీదకి రండి. మీ అధ్యక్ష స్థానం అలంకరించండి' అన్నాడు ఆమెకు సన్నగా నివేదన చేస్తూ.

'నేనా? నేనేనా?' అంది సునీత.

'అవును, మేడమ్. మీరే!' అన్నాడు అతను మరింత స్థాయిగా.

తప్పనిసరి అయినట్లు, ఇంక వేరే మార్గం లేనట్లు సునీత లేచి నిలుచుంది. కార్యకర్త వెనకగా నడుస్తూ వేదికమీదకు వెళ్ళింది.

హాలులో వున్న జనమంతా చప్పట్లు కొట్టారు.

ఎవరైనా వేదికమీదకు వస్తున్నపుడు జనం ఇలాగే చప్పట్లు చరుస్తారు, అది మామూలే. అయినా జనం ఈ మారు ఎందుకిలా చప్పట్లు కొడుతున్నారో సునీతకి అర్థంకాకపోగా, కాస్త ఆశ్చర్యం అనిపించింది కూడా.

తాను అంగీకరించి వస్తున్నందుకా?

ఎందుకయినా కావచ్చును – అనిపించింది.

ఎందుకయినా తనకేమీ నిమిత్తం లేదనిపించింది. అయినా ఈ సందర్భంలో ఏదో కొత్తదనం కనిపించింది.

మర్యాద కోసం, మన్ననకోసం ఇన్నాళ్లూ ఇన్నేళ్లూ తాను చేసిన త్యాగాలకు 'ప్రతిఫలం' ఈ చప్పట్లు. మొదటిమారు తను వేదిక మీదనుంచి కిందికి దిగిరావడం మంచిపనే అయింది. తనను ఇన్నాళ్లూ క్షోభపెట్టిన మనిషినుంచే తనకు ఈ గౌరవం, గుర్తింపు రావడంవల్ల ఈ త్యాగానికి పరమార్థం దొరికినట్లయింది కదూ!

'ఆమె' అంటే భయపడింది సునీత ఒకప్పుడు.

కాని ఇప్పుడు 'ఆమె' చేసిన పనికి మనసంతా ఆనందం నిండింది. మెప్పుదల పండింది.

'ఆమె'ను ఇంతకుముందే కలుసుకుని మాట్లాడి వున్నట్లయితే, నా మనిషిని ఆకట్టుకున్నందుకు మనసంతా ఉక్రోషంతో ఉబికి ఊరుతూ వుండేది. 'ఆమె' చూపిన ఔదార్యంవల్ల, ప్రత్యర్థి గౌరవ ప్రతిపత్తులను కాపాడినందువల్ల ఇప్పుడు మనసంతా కృతజ్ఞతతో పొంగిపోతోంది సునీతకి.

అంతా మంచికే జరిగింది అనుకుంది.

గోవిందరావు ఇప్పుడు ఆమె దగ్గరకు బయలుదేరుతూ వుంటే సునీతకి అంత బాధ అనిపించడంలేదు.

'ఆమె' అతన్ని ప్రేమిస్తోంది. అతని గౌరవ మర్యాదలను పరిరక్షిస్తోంది. నాకంటే ఆమే గోవిందాన్ని ఎక్కువగా సుఖపెడుతోంది. ఆమెకూ ఓ భర్త, ఆ భర్తమీద హక్కులూ వున్నాయి. కాకపోతే, అతనే నాకూ భర్త అయినాడు, –అనుకుంది సునీత.

❋

*(ఆంధ్ర భూమి పత్రిక 18-11-2006)*